# అభ్యుదయం

క్రొత్త బ్లాక్ డెవలప్ మెంటు ఆఫీసరు ఛార్జి తీసుకోడానికి వచ్చాడు. పాత ఆఫీసరు తన క్రింద వున్న వివిధశాఖల యజమానులను పరిచయంచేసి బ్లాక్‌లోవున్న కొన్ని గ్రామాలకు జీపుమీద వాళ్ళతో కలసి తీసుకవెళ్ళాడు.

"ఇదిగోండి-యీరోడ్డు యీ గ్రామస్థులంతా కలసి కట్టుకున్నారు. అదిగో-ఆస్కూల్ బిల్డింగ్ కట్టడానికి ప్రభుత్వం నాలుగో

పంతు డబ్బేయిచ్చింది. మిగతా, ప్రజలు శ్రమదానం చందాలు లేసి కట్టుకున్నారు. ఈ ప్రక్కవూరులో జపాను వరిసాగు వలన అదనంగా పది 'గరిశెలపంట పండింది, అదిగో కనిపిస్తోందే ఆవూరు-ఇంకా రోడ్డుపూర్తికాలేదు. ఆవూర్లో మనంపెట్టిన రాత్రిపాఠశాలలో పందమందిపైగా చదువుకుంటున్నారు"....ఇలా యెన్నో రకాలుగా జరుగుతున్న అభ్యుదయాన్ని చూపించి, తెలియపరచి తిరిగి వచ్చేసరికి ప్రొద్దు క్రుంకింది.

ఆ రాత్రి క్రొత్తఆఫీసరూ, పాత ఆఫీసరూ ప్రభుత్వం గ్రామానికి దూరంగా వుద్యోగుల నివాసంకోసం కట్టిన భవనాలలో పెద్దదైన డెవలప్‌మెంట్ ఆఫీసరు యింట్లో నివసించారు. భోజనాల దగ్గిరే పాత ఆయన గుసగుసలు మొదలు పెట్టాడు.

"కొందరికి వుద్యోగాలు దొరకడానికి కంట్రాక్టర్లు బాగుపడడానికీ గానీ-ఇదంతా వుత్తదండగ!"

క్రొత్త ఆఫీసరు కుర్రవాడు. ఒక్కసారి అతని కళ్ళల్లోనికి చూశాడు.

"నేను గుమాస్తానుంచి యింతవరకూ వచ్చి రిటైరవుతున్నానా? ఈ సర్వీసులో వేలకొలది మనుష్యులను స్టడీచేసాను, విధి లేక మనం చేయవలసిన ప్రచారం చేయాలిగానీ యీప్రజలే వుత్తి సోమరుపోతులండీ-నలుగురు కూడినదగ్గర నాలుగుపార్టీలు, ఒకడు కాదని యింకొకడుఅవుననీయిలా వాళ్లోవాళ్ళే తన్నుకుని చస్తుంటారు

"అయితే మీరు యిదంతా ప్రజలేచేశారా? చెప్పినదాంట్లో నిజంలేదా?" ప్రశ్నించాడు. క్రొత్త ఆఫీసరు.

"జూనియర్స్ వున్నారని అలా చెప్పాను. కాగితాలమీద వాళ్ళుచేశాంనేవుంది. కానీ మనలో మాటగా చెప్పాలంటే-దేసిం దంతా ప్రభుత్వమే దొంగరాతలు. విధిలేక వ్రాయకపోతే మన ఉద్యోగాలు వూడిపోవా? వెధవవుద్యోగం-యిది యిది యేం వుద్యోగమండీ? అందరూ సవారీయే. మంత్రిగారు వస్తున్నారని ప్రోగ్రాం వచ్చింది. ఏం చూపిస్తాను? మీరు స్కూల్ ముందు మొక్కలు బాగు న్నాయని మెచ్చుకున్నారే! అవి మంత్రిగారు వచ్చే ముందురోజు పట్నంలో గోలాలతో కొన్నాం. గొయ్యిలుతీసి గోలాలతోనే పాతి పెట్టేశాం, పది గరిశల హెచ్చుపంట నిజమనా? ఆ యెగ్రికల్చర్ డిమాన్‌స్ట్రేటరు వాడి వుద్యోగం నిలబెట్టుకోవద్దూ? అఆలు వంకర టింకరులుగా వ్రాయగలిగినవాడూ మావలన చదువవచ్చరినవాళ్ళ లిస్టులో పడిపోతున్నాడు. బంట్రోతు దగ్గరనుంచి పైవరకూ యెవ రికీ బాధ్యతలేదు. ఇంకా చెప్పటానికి బోలెడంత భాగోతంవుంది. తినబోయే వాళ్ళకు రుచి చూపించటం యెందు?"

ఈచివరి మాటలతో క్రొత్తవానికి యెంతో ఆలోచించటానికి అవకాశం యిచ్చాడు. తెల్లవారి లేచేసరికి పాత ఆఫీసరు దేవాల యానికి వెళ్ళి వచ్చేశాడు. ఇంటిదగ్గరకూడా పూజగదివుంది. ఆయన భార్యకూడా చాలాభక్తురాలుగానే తోచింది.

ఆ రోజున ఆఫీసులో గుమాస్తాలంతా కలసి వెళ్ళిపోతున్న ఆఫీసుకు పెద్దపార్టీ యిచ్చారు. ఆ పార్టీకి ఆ బ్లాకులోని నలభై గ్రామాలు పంచాయితీ ప్రసిడెంట్లూ, కంట్రాక్టర్లూ కూడా వచ్చారు. క్రొత్త ఆఫీసరునుకూడా రమ్మని కోరారు. పార్టీఫోటోతోసహా ఘనంగా జరిగింది. పార్టి అయ్యాక యిద్దరు తెలిసైన గుమస్తాలు, హెడ్

గుమస్తా, నలుగురు పంచాయితి ప్రెసిడెంట్లు ఒక కంట్రాక్టరు వెళ్ళిపోతున్న ఆఫీసరుయొక్క గుణ గణాలను వాని వుద్యోగ సమర్ధతను అభివర్ణిస్తూ వుపన్యాసాలు యిచ్చారు. ఆ వుపన్యాసాలలో అతనంత సమర్ధుడు అరుదని అతని గుమస్తాలు అతని కాన్ఫిడెన్షల్ రిపోర్టు వ్రాసినట్లుగా బల్లగుద్ది చెప్పారు.

తను యీ మంచివాళ్ళ నందరినీ విడిచిపెట్టి వెళ్ళిపోడానికి విచారిస్తున్నాననీ, యీబ్లాకు యింత సమర్ధంగా నడవడానికి ప్రభుత్వంవారు మెచ్చుకోడానికి కారణం యీబ్లాకులో వున్న ప్రజలు, వుద్యోగులమధ్యనున్న సహకారమేననీ. యీ క్రొత్త ఆఫీసరుకు ఆ సహకారమే మీరంతా యిస్తారని ఆశిస్తున్నాననీ యిలా తనకు జరిగిన యీ గౌరవానికి వుచితరీతిని సమాధానం యిచ్చాడు పాత ఆఫీసరు.

చచ్చిపోయినవాడు ఎంతచెడ్డ వాడయినా నాలుగుమంచి మాటలు అనటం సబబు. అలాగేయిలాంటి వీడ్కోలు సభలలో పొగడటంమర్యాదసంప్రదాయమున్నూ. క్రొత్త ఆఫీసరు యీవ్యక్తి గురించి మనస్సులో వేరే అభిప్రాయం వున్నా ఈమర్యాదపాటించి "ఆయనకుండే అనుభవం తనకులేదనీ, అంచేత తనకు అనుభవం వున్న యిక్కడవ్యక్తులంతా సలహాలతో సంపూర్ణ సహకారం యిచ్చి సహాయపడాలనికోరారు.

క్రొత్తఆఫీసరు కుటుంబం యింకా రాలేదు. ఇంట్లో ఒక్కడే. ఇల్లు చాలాపెద్దది. మామూలు ప్రకారం బంట్రోతు ఆఫీసరు యింటి దగ్గర వాకిట్లో నిద్దర పోవడానికి వచ్చాడు.

"నీకు పెళ్ళాంపిల్లలులేరా?" అడిగాడు.

"ఉన్నారుబాబూ!"

"అయితే మా యింటిదగ్గర యెందుకు పడుకుంటావ్? లే వెళ్ళిపో! నీసహాయం కావలసినప్పుడు కోరతానులే. ఆఫీసులోపగలు పనిశుభ్రంగాచేసుకో చాలు."

వాడు సంతోషంగా వెళ్ళిపోతాడనుకున్నాడు. కానివెళ్ళలేదు. తమరు ఒంటిగా ఉన్నారు. ఏటైంలో యేంఆపద వస్తాదో యెవరు చెప్పగలం? మాటసాయానికైనా పనికిరానా బాబూ! అమ్మగారు వచ్చేదాకా పడుకుంటాను."

క్రొత్త ఆఫీసరు నీరుతిరిగినకళ్ళు అతనికి చూపించకుండా అతని చెయ్యిపట్టుకొని గదిలో పడుకోటానికి జాగాచూపించాడు. ఆ రాత్రంతా ఆలోచనలతో తలనిండిపోయింది. తనమనస్సులో యిక్కడ మనుష్యులనుగూర్చి, పాత ఆఫీసరు సృష్టించినభూతాల బొమ్మలను యీ సంఘటన ఒక్కటే సగం చెరిపివేసింది. తను యీ నలభైగ్రామాలకు అభ్యుదయానికిపెద్ద! ఆలోచించకుండా యేపనిచేసినా కొన్నివేల ప్రజలకు దెబ్బతగులుతుంది. పరిస్థితులు సవ్యంగా తనెలా మార్చగలననేఆలోచనే తనను వదలకుండావుంది.

ఆలోచనలతో వారంరోజులుగడిచిపోయింది. ఆ వారంరోజులు పోయాక ఒకరోజు ఉదయం ఆఫీసులో బ్లాకు ఉద్యోగస్థులంతా చేరారు. క్రొత్తఆఫీసరు వాళ్ళనుద్దేశించి అన్నాడు "నాపేరురామారావు. నేను రాముడంతటి వాణ్ణికాలేను కానీ నాకాపేరు ఒక విధమైన బాధ్యతలను గుర్తుకుతెస్తుంటుంది. రాముని చరిత్ర మనం చూస్తే అంతాత్యాగం. పినతల్లి కోర్కె తీర్చటానికి సింహాసనాన్ని విడిచి

పెట్టిభార్యతో నానా కష్టాలు పడటానికి అడవిపాలచేశాడు. ప్రజలను సంతోషపెట్టడానికి నిండుచూలాలు, మహాపతివ్రతయైన అర్ధాంగి సీతమ్మతల్లిని అడవిలో పెట్టించాడు. మనమంతా జీతంకోసమే పని చెయ్యటంలేదు. మనం సవ్యంగా చేసినపని యిచ్చే ఆత్మానందం కోసమే పనిచేస్తున్నాం. త్యాగంలేనిదే యేపనీ సవ్యంగా జరగదు మనం పట్టుదలతో యీ బాధ్యతను నెరవేర్చాలి."

అందరూ అతని యెదురుగా తలలూపారు. వెనుక గుసగుసలాడుకున్నారు, "మాటాడినట్లు పనులుసాగిపోతాయా? కుర్రవాడు క్రొత్త ఆవేశం వుంటుంది. ముందుకు సాగాక ఆయాసంవచ్చి కూలబడిపోతాడు. త్యాగం అంటున్నాడే యేదీ తనకిచ్చినబంగళావదలి ఒక పూరిగుడిసెలో వుండమనూ? ఈ స్టేటుగవర్నమెంటువారిచ్చిన చాలీచాలనిజీతాలతో తిళ్ళతో మేమంతా కూలబడిపోతుంటే యింక శక్తియేదీ? తనకి పదిమందివుంటే ఫస్టుతారీఖు యెప్పుడువస్తుందా అని మాలానే యెదురు చూసేవాడు. ఇన్ని కబుర్లు ఆడుతున్నాడు. కబుర్లు ఆడేవాడు యేంపనిచేస్తాడు. ఆ వెళ్ళిపోయిన ఆఫీసరు యెంతమంచివాడు. ఎవరినీ నొప్పించలేదు. తానునొవ్వలేదు. నవ్వుతూనే యెలాంటిసమస్యలనూ పరిష్కరించేవాడు. వీడావచ్చి వారంరోజులుకాలేదుగాని హెడ్‌క్లార్కుమీదా, సోషల్ యెడ్యుకేషన్ ఆఫీసరుమీదా వేసినకేకలు మైలుదూరం వినపడ్డాయి. వాడికి పని నచ్చకపోతే ఛార్జిషీటు యిచ్చుకోని కానీ యీ కేకలు వెయ్యడమేమిటి? ఇన్‌సల్టు. వీడికి యేంపనిచాతకాదు. ఫైళ్ళకట్టలు పడున్నాయ్. చూస్తేనా? పాతఆఫీసరు రాత్రిపద్దైనా ఖాళీచేసిమరీవెళ్ళేవాడు. వీడికి తిరగడం తెలుసు—పసందైన పల్లెవనితలవేపు దృష్టిపోనిస్తాడు!"

ఇలా క్రొత్త ఆఫీసరు గురించి క్రింద వుద్యోగస్థులు అనుకున్నారు అతని వరకు వెళ్ళనిరీతిగా! కొన్ని రోజులు గడిచాయ్. ఆరోజు హెడ్‌క్లార్కును పిలుస్తున్నాడంటే ఆఫీసులో గుమస్తాలంతాకూడా వ్రాయటం ఆపేశారు. బంట్రోతులు నవ్వుకున్నారు. ఇదివరకు బంట్రోతులు యేదో ఒకరోజు ఆలస్యంగా వస్తే సంజాయిషీ కావాలి. వాళ్ళు రోజూ ఆలస్యంగా వచ్చినా అడిగేవాళ్ళులేరు. ఇప్పుడు అలాకాదుగా. అరగంట ముందుగా అందరూరావాలి. వస్తున్నారు. కాగితాలు వేగంగానడుస్తున్నాయ్. లేదా అంటే ఆఫీసుముందుండే కంప్లయింటుబుక్‌లో యెవరైనా వ్రాయచ్చుగా! ఆమరుసటి రోజు బ్లాకులో ఉద్యోగుల మీటింగు పెట్టమన్నాడు.

ఆరోజున రామారావు అన్నాడు "ఇక నేను మీ అందరినీ నెలకొకసారే కలుసుకుంటాను. అందరికీవర్తించిన సమస్యలు ఆ మీటింగులో తీసుక రావచ్చు. ఏది ఆచరణయోగ్యమో నలుగురూ ఒప్పుకున్నాక చేద్దాం. ఎప్పుడైతే యిలాచేద్దామని అనుకున్నామో దానికి వ్యతిరేకించిన వాళ్ళైనా దానిని ఆచరించవలసిందే.! వారానికొకసారైనా యింతవరకు మిమ్మల్ని కలుసుకొని యెందుకు మాట్లాడానో మీకు తెలుసు. మీరంతా నా అంగాలు. నాఅంగాలు సరిగ్గా లేకపోతేరక్తం సర్వనాడుల్లో సరిగ్గా ప్రవహించదు. నేను ఆరోగ్యంగా పని చెయ్యలేను. మీలో యెవరికి కుటుంబవిషయాలుకానీయండి, పనిలోకానీయండి యెలాంటి విషయాల్లోనైనా యే ఆపద వచ్చినా నన్నుచూడవచ్చు. నా కాలికి దెబ్బతగిలితే నాచెయ్యి వూరుకుంటుందా? మీలో యెవరిలోనైనా చెడుగుంటే అ

చెడుగు నాది. ఆచెడుగు బోగొట్టడానికి ఒకసర్జనులా నేను ఒరిసిన పేగు కత్తితో కోసినట్లు మీ మీద యెగిరి పడవచ్చు అంతమాత్రాన నేను మిమ్ములను ప్రేమించలేదని యెలా అనుకుంటారు? ప్రేమ వుండబట్టి మీ బాధ్యతలను నేను స్వీకరిస్తున్నాను. నేను మిమ్ములను ప్రేమిస్తాను. మీరు మీ దిగువవాళ్ళను ప్రేమించండి. మన జీవితమూ ఒకవేపు రస్తాకాదు. రెండు వేపులా నడవడానికివుపయోగించే మార్గం కావాలి. మీరు ఒకరికి మర్యాద యిామునిది యెదటి వాళ్ళనించి కాంక్షించడం తప్పాకాదూ? జీవితం పుట్టి పెరిగి చావటం కాదు. ఒక సంవేశం అనుకోండి. నిజాయితికి మించిన గుణంమనిషికిలేదు. మనం అంతా ఒక్కుమ్మడిగా పనిచేద్దాం ప్రజల్లో మన ప్రవర్తనతో చైతన్యాన్ని లేవనెతుదాం. తరువాత వాళ్ళే తమపని చూసుకుంటాయి.

ఈసారి అంత గుసగుసలు లేవు. కేకలువేస్తాడేగాని అప్పుడే మరచిపోతాడు. కేకలు వేశాడూ అంటే కాగితంమీద పెట్టడు. పాతవాడు నవ్వుతూనే యెందరి మీదోచెడుగు వ్రాసి పోయాడు. ఇతడు పంటిసలుపుకు మందు రాస్తాడు తగ్గదు. పన్ను పుప్పిదై పోతుంది. అది మరి పీక్కపోతే. మిగతా పళ్ళన్నీ పుప్పి కవూ? ఆ గ్రామంలో తన అసభ్యపు ప్రవర్తనతో సంచలనాన్ని కలుగ జేసిన గ్రామ సేవకుడిని రామారావు డిసిమిస్ చేయించాడంటే తప్పేం వుంది? రామారావు భయముతో పని చేయిస్తున్నాడన్నవాడు రాను రాను తగ్గి అతనంటే కల్మషం లేనివాడని న్యాయంకోసం యెంతపనైనా చేస్తాడనే విశ్వాసం పొడచూపింది ఉద్యోగులలో. అతనిని తమ న్యాయమైన హక్కులను రక్షించి

పెద్దగా గౌరవించ సాగారు. ఏవిషయంలోనూ అతనిని అబద్ధాలతో యెవరూ మభ్య పరచలేరు.

ఇప్పుడు ప్రతీ ఉద్యోగి తనుయింటికి తనుపెద్దయై యెలా తను బాధ్యతగా ప్రవర్తించి తృప్తిపడుతున్నాడో తన ఉద్యోగం లోనూ అలానే ప్రవర్తిస్తున్నాడు. ఏదైనాతప్పి చెడి అపదవస్తే ఆదుకొనే ఆఫీసరు వున్నాడనే విశ్వాసం తృప్తిగా పనిచేయిస్తోంది.

ఇంటిని యిలా చక్కబరుచుకున్నాక ఉమారావు ప్రజల్లో పడ్డాడు. ప్రెసిడెంట్లని, గ్రామ పెద్దలనేకాదు తను కలుసుకున్నది. కూటికిలేక బాధపడేవాళ్ళనీ, రోగిష్టులనీ, అనాధులనీ-ఆశ్రితులని కలుసుకున్నాడు. వాళ్ళ కష్టాలూ, సుఖాలూ తన కష్టసుఖాలై పో యాయ్. ఆ చక్కని ప్రకృతి మధ్య యెడతెగని బాధలు. అవన్నీ చూసి, తలచుకొని వాళ్ళల్లో తను ఒకడై పోయి తృప్తిపడాలనిపిం చింది: వాళ్ళను తలచుకొని వాళ్ళక్రింద సేవచెయ్యాలన్న వుబలా టంతో ఒకోసారి తబ్బిబ్బయి కళ్ళల్లో నీరు తెచ్చుకొనేవాడు. ఆనీరు వ్రేళ్ళతో తుడుచుకొన్నాక ఆవ్రేళ్ళు చూసుకొని అలా కొంత సేపటికి పిడికెలు పట్టేవాడు. ఉబలాటంతో యివి సాధించవలసిన పనులు కావు. ఒక్కడూ సాధించలేడు. ఈ లోకంలో అందరికీ సరిపడ్డ కూడూ, గుడ్డ వుంది కాసే ఆశతో నిల్వచేసుకొనే వాళ్ళు సహకరిం చక పోవడంవల్ల, నిరాశతో కొందరు కృంగి చావవలసి వస్తోంది. ఉన్నవాళ్ళ సహకారం యెంతైనా కావాలి. ఆశను చంపుకోవటం అంత సులువైన పనికాదు. మనిషిలో మనస్సనే రాక్షసడొక్కడే లేడు-హృదయమనే దేవుడు కూడా వున్నాడు. ఆ దేవుడు శివునిలా త్యాగమూర్తి. నిష్కల్మషుడు-హాలాహలాన్ని నవ్వుతూ మింగగలిగే

సాహసుడు శ్మశానంలో నిద్రపోతున్న ఆ దేవుణ్ణి మేల్కొలపాలి! ఇంతమందిలో ఒక్కసారి మేల్కొలపడ మెలా?

ఆలోచించాడు. పెద్దలకు చేసే విజ్ఞప్తులు ఫలితం అట్టేలేదు. మొగమాటానికి ఏదో ఒకరోజు సహాయంచేసి వూరుకున్నారు. తన క్రిందనున్న నల భై గ్రామాల్లో ఒక్కడూపనిలేదనకూడదు, ఒక్కడూ ఒక్క పూటైనా పస్తువుండకూడదు, ఒక్క రోగీ వైద్యసహాయం లేక పోవటం వలన చచ్చిపోయాడని అనుకోకూడదు. ఈ కోరికలు పెద్దవికావనే తన విశ్వాసమే యింకా తనను ఆలోచింపజేసింది.

ఇంటినించి భార్యతో చెప్పకుండానే ఒకరోజు యేకాంతంగా కదిలాడు. అడ్డంగా పొలాల,గట్లమీద నుంచి వెళ్ళిపోతూ తల ఒక సారి యెత్తాడు. ఎదరగా ఒకతోట కనిపించింది. ఆ తోటలో రకర కాల చెట్లున్నాయి. తోట ఒడ్డున ఒకచెట్టు కొమ్మను అనుకొని నిల్చుని-దూరాన నీటిఒడ్డున జలకమాడి తడిబట్టలతో నిల్చొని యెర్రని బొట్టు ముఖారవిందంలో అలంకరించుకున్న పడమటి కాంతను ముగ్ధుడై తిలకిస్తున్నాడు. అక్కడికి యెగిరి ఆ యెర్రని పెదిమలను ముద్దులాడాలనిపించినది. వెనుతిరిగేసరికి కిలకిలలా డుతూ అలాంటి యెర్రని పెదిమలే అగుపించినయ్. అటుతిరిగి ముచ్చటగా చూశాడు. సిగ్గుతో మాటరాని మగువలా ఆ చెట్టుమీద నున్న కోతి పిల్లలతో కూర్చొని సిదానించి చూసి యెర్రని పెదిమ లతో వెక్కిరించింది. తనూ అనుకోకుండా కోతులను వెక్కిరించాడు కోపముతో ఆమె జామికాయ విసరికొట్టింది. చిన్న కోతులు చేతిలో వున్న కాయలు విసిరేశాయి.

తన ఆవేదనలకు సమాధానందొరికింది. ఆ పెదిమలనుదూరం

నించే ముద్దులాడాడు. ఊర్లోనికి వచ్చాడు. ఆ వారంరోజుల్లోనే పూరి మధ్యలో నున్న తన క్రొత్తయిల్లు పూరిగుడిసె యాత్రాస్థలమైపోయింది. "అంత పెద్దబాబు - ఆ పెద్దబంగళా ఆసుపత్రికి మరికొన్ని మంచాలు వెయ్యమని ఇచ్చివేశాడు. అంత పెద్దయింటి యిల్లాలు మొగుడితో యీ పాకలో వుంటోంది. ఈబాబు చాలా మంచిబాబు" అని ప్రజలు అనుకున్నారు. పొరుగు బ్లాక్ ఆఫీసర్లూ, వుద్యోగులు యిదంతా పెద్దప్లాను వేసుకొని చేశాడనీ వచ్చే ఎలక్షన్లసరికి వుద్యోగం వదలి ఎసంబ్లీకి నిలబడటానికి యీ ఎత్తులు వేశాడన్నారు. కానీ ప్రజాసీకంలో యిదొక గొప్ప పరివర్తనను తీసుకవచ్చింది. తమ బ్లాకు పెద్ద పూరికి దూరంగా నున్న మట్టకు నామాలకాకి అన్నట్లుండక వాళ్ళమధ్య పాకలో నివసిస్తూ, వాళ్ళ బాగోగులు చూస్తున్నాడనే విశ్వాసాన్ని తీసుకవచ్చింది. ఇదికాదు ఆసుపత్రిలో అనాధులైన రోగులకు మందులు కొనటంకోసం తన జీతంలో నాల్గోవంతు ప్రతీనెలా యిచ్చేస్తున్నాడు. ఈ త్యాగం యింట్లో భార్యతో తగువును తీసుకవచ్చినది గాని వూరూరా తన యందు ఎనలేని గౌరవాన్ని యినుమడింప జేసింది. తనకు యింటిలోనే కాదు వీధిలోకూడా అడ్డంకులు లేకపోలేదు. మంచి పని చేసేటప్పుడు అడ్డంకులు వస్తాయి. కాలమే వాటిని రోడ్డురోలర్‌లా చదును చేస్తుందనే విశ్వాసం తనకుంది.

ఆ వచ్చేనెల జీతాలిచ్చేటప్పుడు తన వుద్యోగుల్లో కొందరు తమకు తోచినది పేదరోగులకు మందులకోసం తమంత తామే యిచ్చారు. ఆది చూసి కలవారుకూడా సహాయం చేశారు. ప్రజలే తోడి అభాగ్యులకు సహాయపడటంతో రామారావుకు వత్వంమీద నమ్మిక ద్విగుణీకృత మయింది.

ఈ నల్లభై గ్రామాలపంచాయితీ ప్రెసిడెంట్లను సమావేశానికి ప్రతీ వూర్లో నుంచీ ఒక కటిక పేద కూడా వచ్చాడు. "మనది ఓర్పుతో కూడుకున్న జాతి. ఒకరిమీద మనకు అసూయలేదు. ఒకరిమీద అంటే ప్రభుత్వం మీద కూడా మనం ఆధార పడకూడదు. మన నల్లభై గ్రామాల్లోనే కాదు.; పై గ్రామాలలోను, ఏ కష్టాలొచ్చినా ఆదుకోగలమనే గుండె ధైర్యం మనకుండాలి, ఒక్కడు యెంత బలం గలవాడైనా, యెంత ధనవంతుడైనా ఆ ధైర్యం కలగదు. మీ అందరి చేతులు కలవాలి- అందరి చేతులు కలవాలంటే అందరూ ఒకే త్రాటిమీద నడివాలి. నిజాయితీయే మన పార్టీ. అన్యాయంగా పోయినవాడు స్వంతబిడ్డయైనా మనం కనికరించేది లేదు- ఈ కలిసి కట్టుగా వుండటానికి యిలా నెలకొకసారి మనమంతా కలుసుకొని మీ వూరిలో కష్టనిష్టురాలు చర్చించుకొని కలిసికట్టుగా అన్ని గ్రామాలవారు అవి నివారించుకుంటారనే ఆశతో మీ అందరినీ సమావేశ పరిచాను. నేనూ, నా ఉద్యోగులు మీ కెలాంటి సహాయం, సలహాలు కావాలన్నా యీయగలం. "మమ్మల్ని ఆజ్ఞాపించి వినియోగించటం మీలోవుంది". ఈచివరి మాటలు అక్కడ సమావేశమైన వాళ్ళకు గర్వకారణమైనది. ముందు పేదల కష్టాలు వారి నోటి వెంబడే వినిపించాడు. వాటి నివారణోపాయాలు మీరు పెద్దలు ఆలోచించండి అని గ్రామ పెద్దలను కోరాడు. మనిషికి బ్రతకటానికి ఆహారం ఎలా కావాలో పున్నతిని సాధించటానికి సరియైన పొగడ్త కీర్తి కావాలి. అది మానవ సహజం. వాళ్ళను పెద్దలని గవర్నమెంటు అధికారులే గుర్తించటంతో వాళ్ళనించే యెన్నో రకాల సలహాలు వచ్చాయి. రామారావుయీ రాళ్ళనన్నీ ఒకచోట చేర్చికట్టేసహకారమనే మేడలో

సిమ్మెంటుగా పని చేశాడు. వాళ్ళు యిలా చర్చించి పరిష్కరించిన సమస్యలివి;

ఈ నలభై గ్రామాల్లో వున్న పనిచేసికొనే శక్తిలేని బిచ్చగాళ్ళకు ఒక వూరిలో మూడు పాకలు కట్టివుంచారు. బిచ్చగాళ్ళు యిళ్ళమీద పడకూడదు. వాళ్ళకయ్యే ఒకరోజు ఖర్చు ఒక్కొక్క గ్రామంభరించేటట్లుచేశారు.

ఆ నలభై గ్రామాల్లో నాలుగు ధాన్యం మిల్లులున్నాయ్, ఈ బిచ్చగాళ్ళకోసం సంవత్సరానికి ఒక్కొక్క మిల్లు పది బస్తాల బియ్యం యీయమన్నారు. కానీ ఆ షావుకార్లు ఒప్పుకోలేదు అంచేత రైతులంతా ఒక్కుమ్మడిగా ధాన్యం దంపించటం మొదలు పెట్టారు. దీనివలన మిల్లులన్నీ మూయవలసి వచ్చింది. ఇంచు మించు కూలీజనానికి చేతి నిండుగా పని కడుపు నిండుగా తిండీదొరికింది. పంట పొలాల్లో తనూ రైతులా బురదలో తిరుగుతున్నాడు. తను చేసే ప మీలేదు. అతనిముఖంచూడగానే ప్రజల్లో వుత్సాహం ద్విగుణీకృత మౌతోంది. ఎరువులు ఆ బాబు నోటి వెంబడి వెయ్యమని వచ్చింది. కాబట్టి భూమి కొరెక్కదు. క్రొత్త స్కూళ్లు భవనాలు కట్టడానికి మాకు ప్రభుత్వం వద్దనించి డబ్బు వద్దన్నారు. కానీ రామారావు ఆ డబ్బు పుచ్చుకొని యింకో పని కోసం వుంచ మన్నాడు.

మంత్రిగారు వచ్చేటప్పుడు ఆయనను ఘనంగా సత్కరించారు. తాము కలసిమెలసి చేసుకున్న అభ్యుదయాన్ని చూపించారు. మంత్రిగారు మెచ్చుకొని వారు అడిగిన ఒకే కోరికను మన్నించారు. ఊరూరా తిరిగే మోటారు ఆసుపత్రి వచ్చింది.

దానికి సగండబ్బు గ్రామస్థులే యిచ్చారు. ఇన్ని సభహాలూ పనులూ తను తెర వెనుకనించే చేశాడు. కో ఆపరేటివ్ స్టోర్సు, క్రెడిట్ సొసైటీలు బాగా నడుస్తున్నాయ్. ఇదివరకు అప్పు కావలసి వస్తే వచ్చినదాంట్లో నాల్గోవంతైనా రైతు, అధికారుల మూతులు కట్టవలసివచ్చేది. ఇప్పుడు అంతా సులభం—కటిక పేదవాని అరుపు అరణ్యరోదన కాలేదు. అతని అరుపుకు విలువవుంది—అధికారం వుంది.

ఈ రెండేళ్ళలోనూ తను కిరీటమే తగిలించుకున్నాడు. కానీ అది ముళ్ళ కిరీటమే అయింది. తను యెన్ని రాత్రుల్లో ఆవేదనలతో నిద్దరపోలేదు. అంత సులువుగా పనులు జరగలేదు. తను చేసే ప్రతి పనికి అనుకూలం ప్రతికూలం రెండూ వస్తుండేవి. ఇప్పుడైనా చెయ్యవలసింది యెంతోవుంది. ప్రజల్లో ఒకవిధమైన విశ్వాసం, బాధ్యత కూడుకున్న వాతావరణం సృష్టించబడింది. రింగులో పోట్లాడే యిద్దరు మల్లయోధుల్లా మంచీ చెడుగూ పోట్లాట యీ లోకంలో జరుగుతునే వుంటుంది. చివరికి మంచి జయిస్తుందన్న విశ్వాసం ప్రపంచాన్ని ముందుకు నడిపించే వాళ్ళల్లో వుండబట్టే మానవాళి కష్టాలనుంచి గట్టెక్కుతుంటుంది. భక్తునికి దేవునియందుండే భక్తి విశ్వాసంలా ప్రజలకు నాయకునియందు విశ్వాసం యేర్పడాలి. ఆ విశ్వాసం రావాలంటే నాయకునిలో దైవతుల్యమైన గుణ గణాలుండాలి. ఆ విశ్వాసం కోసమే తను త్యాగం చేశాడు. ఆ త్యాగం నలుగురికీ తెలిసినట్లు చేశాడు. తెలియని త్యాగం వృథా. తెలిసిన త్యాగం మనిషికి తోడివాళ్ళల్లో పరపతిని తీసుకవస్తుంది. తల్లీ తండ్రీ లేకపోతే యీ లోకంలో బ్రతుకవచ్చు కానీ పరపతి లేకపోతే బ్రతకడం కష్టం. ఆ పరపతిని రామారావు సంపాదించినట్లు చేసింది. ఆ వానరం ఆ స్థలానికి యిదివరకు

యెన్నిసార్లో వచ్చాడు. ఈవేళావచ్చి యేకాంతంగా కూర్చొని ఆత్మ పరిశోధన చేసుకుంటున్నాడు.

ప్రభుత్వం వ్యవసాయం, వైద్యం, సాంఘికవిద్య శుభ్రత, ఆరోగ్యం మొదలైన జీవిత అవసరాలలో గ్రామస్థులకు సహాయ పడటానికి సిబ్బందినీ పరికరాల నిచ్చారు. ఇదివరకు వారు వాటిని వాడుకొనే పరిస్థితులలో లేరు. ఇదివరకు అవన్నీ వృధా! ఇప్పుడు అవన్నీ తప్పక అవసరం. ఉద్యోగులుకూడా చేతి నింపుగా పనితో, తామూ నిజమైన పనిచేస్తున్నామనే తృప్తితో మసలుతున్నారు.

పడమటి ఆకాశంలో మబ్బుతెరలు పయనిస్తున్నాయ్ తన కళ్ళుమబ్బులు కమ్మాయ్. వైద్యుని అవసరం రోగికి జబ్బుగా నున్నప్పుడే! జబ్బు నయమయ్యాక రోగి దగ్గర వైద్యుడు కూర్చుంటే మళ్ళీ జబ్బురావచ్చు. ఈ బ్లాకులో ఒకరినొకరు సహక రించుకుంటూ ఆరోగ్యంగా పనిపాటలు సాగి పోతున్నాయ్. తను పనిలేక సోమరిగా తిరుగుతున్నాననే భావన కలిగింది. అక్కడి నుంచి యింకోదగ్గరికి తనుపోవాలనే కోర్కె ప్రబలమైంది.

ఒక వ్యక్తి తనను వెతుక్కుంటూ వచ్చాడు. తన ప్రక్కనే కూర్చున్నాడు. అతను ప్రజలలో రామారావు తెచ్చిన చైతన్యాన్ని యెలుగెత్తి అరిచాడు. కదిలేముందు అసలు విషయం ప్రస్తావించాడు. రాబోయే పంచాయితీ రాజ్యంలో తనను బ్లాకు ప్రెసిడెంట్ చేస్తే అధికారాలను రామారావు చేతిలోనే పెడ్తానన్నాడు.

"నేను వుద్యోగిని నాకు రాజకీయాలతో సంబంధంలేదు"

"అలా అనకండి. ఈ రోజుల్లో రాజకీయాలు మనిషికిఆహారం

లాంటివి. ఉద్యోగులలోనూ, కళాకారులలోనూ, సాధువులలోను కూడ రాజకీయాలున్నప్పుడు యింత వున్నతిని సాధించిన మీరు కాదని అనటం సబబుగాదు."

"ఈ విషయంలో నేనేమీ జోక్యంచేసుకోను. ప్రజలకే విడిచి పెడ్తాను.

పరిష్కరించవలసినవారు ప్రజలు కారు; ప్రజల్లోపరపతివున్న వాళ్ళు మీ దగ్గరకు నేనే మొదట వచ్చాను. ప్రక్క బ్లాకులో ఆఫీసరు ఒకాయనను లేవనెత్తుతున్నాడు. మీరు కాదనకండి" అంటూ రెండు చేతులూ పట్టుకున్నాడావ్యక్తి.

"మన్నించండి. నాకు సబబుగా తోచిన పనిని యెవ్వరూ చెయ్యించలేరు. నాకు ఒకరి అనుగ్రహం అక్కర్లేదు. నా ఆత్మఅనే దేవుని యెదురుగా రామారావు అనే మనసు నిల్చుని చూడగలిగితే అంతే చాలు."

"సరే!" అంటూ అతను వెళ్ళిపోయాడు. మిగతా పార్టీల వాళ్ళు కూడా యేదో ఒక సమయంలో వచ్చి కలుసుకొని, వారి కొందరి పెద్దలద్వారా చెప్పించి, డబ్బు అధికారం ఆసరా చూపించి కూడా చూశాడు. కానీ లాభం లేకపోయింది.

పంచాయితీ పెద్దలు వచ్చి కలుసుకున్నారు.

"తమరు యెవరకు వోటు యిమ్మంటేవాళ్ళకేయిస్తామంటూ" ఒక్కుమ్మడిగా అన్నారు. రామారావు వాళ్ళనుద్దేశించి

"నేను వుద్యోగిని రాజకీయాలతో నాకు సంబంధంలేదు, ఈ వేళ ఒక ప్రభుత్వం వుంటుంది. రేపు యింకోటిరావచ్చు. ఈవేళ రేపటి ప్రభుత్వాల తాలూకు సిద్ధాంతాలను నేను కార్య రూపంలో

పెట్టే బాధ్యత నాకుంది. మన భాషల్లో యే పాశ్చాత్య భాషల్లోను లేని అమూల్యమైన మాట వుంది. దాన్ని "ధర్మం" అంటారు. తన ధర్మాన్ని నిర్వర్తించడానికే అర్జునుడు తాతను, గురువుని స్వజనాన్ని కూడా యుద్ధంలో చంపివేశాడు. ప్రతీ మనిషికి తను సంఘజీవి యైనందుకు సంఘంయెడల తాను ఆచరించవలసిన ధర్మం వుంటుంది. ఆ ధర్మాన్ని మీరు ఆచరించండి. చెడ్డవాడు యెంత మంచిపార్టీకి చెందినా మంచి చెయ్యలేడు. మంచివాడు యెంత చెడ్డపార్టీకి చెందినా మంచి చెయ్యగలడు. సిద్ధాంతాలు ముఖ్యం కాదు. ఆచరణలో పెట్టే మనుష్యులు ముఖ్యం"

ఎలక్షన్లు అయిపోయాయి. ఇంకా బ్లాకు ప్రెసిడెంట్ చార్జి తీసుకోలేదు. తన బదిలీ దాచి పెట్టినా మరుసటి రోజు తన రిలీఫ్ వస్తా డనగా బ్లాకులో గ్రామాలన్నిటిలోనూ తెలిసిపోయింది. ఆవేళనే చాలామంది వచ్చేశారు. తెల్లారే సరికి గ్రామ గ్రామాల నించి ప్రజలు మంత్రిగారికి రామారావును బదిలీ చెయ్యడానికి వీల్లేదని వ్రాసిన అర్జీలు తీసుక వచ్చారు. ఆ అర్జిలన్నీ చేతపటుకొని చూసాడు. ఒక్కొక్క అర్జిమీద గ్రామస్థులంతా సంతకాలు, తమ్మార్కులు పెట్టివున్నారు. కోలాహలం హెచ్చిపోయింది. ఓడిపోయినవారు చెయ్యించారని కొందరు, గెలిచినవాడే తన ఆట సాగదని చెయ్యించాడని మరికొందరు వీళ్ళపని పట్టిస్తామని యెవణ్ణీ పూర్లోకేరానివ్వమని- ఇలా అందరి ఆవేశాలు విన్నాక రామారావు చిరునగవు వెళ్ళబోడు. ఆనవ్వులో కన్నీరువుంది. మాట సరిగ్గా రాలేదు. మాటాడేముందు కళ్ళు తుడుచుకొని "మీరంతా పొరపడుతున్నారు. నా కెవ్వరూ బదిలీ చెయ్యించలేదు. నేను వచ్చి మూ డేళ్ళు కావస్తోంది. నాకు తెలిసింది మీ

అందరితో చెప్పాకున్నా నాకు తెలియనిది మీరు చెప్పగానేర్చు కొన్నాను. మీ పరిపాలన మీరు సవ్యంగా చేసుకొంటున్నారు నా అవసరం యింక యిక్కడలేదు"

"ఉంది- ఉంది" అని ప్రజలు అరిచారు. "మీరు వెళ డానికి వీల్లేదు. మీరు వెళ్ళిపోగానే అన్నీ తారుమారైపోతాయ్"

రామారావు ముందుకొచ్చాడు. అతని కంఠం కటు సది. "నేను వెళ్ళిపోగానే అంతా తారుమారౌతుందా? నిజం గా!"

"నిజంగా!"

"నేను వెళ్ళిపోయాక మనం అంతా కలసి చేసింది నిలిపే వాళ్ళొక్కడైనా మీలో లేరా?"

"లేరు— —"

"అయితే నేను చేసిందంతా వృధా — నేను పుల్లి పేక ముక్కలతో యీ మేడ కట్టాను. నా ప్రయాస అంతా వృధా చేస్తారా —చెప్పండి"

ప్రజలంతా మౌనం దాల్చారు. ఆతృతగా రామారావు అందరి ముఖాలలోనికి చూశాడు. అందరి ముఖాలు అతనివేపు తిరిగాయి. అతని ఆవేదన కన్నీరుగా మారింది. వాళ్ళ కళ్ళల్లోనూ నీరు తిరిగి పోయాయి.

"చెప్పండి— నా ప్రయాస అంతా వృధాయేనా—?"

"లేదు- వృధాకాదు. ఈ మేడకు గట్టిపునాదులున్నాయి. కూలదు—కూలడానికి వీల్లేదు." అని ప్రజల్లో నించి ఒక యువకు

పైడెన పంచాయితీ ప్రెసిడెంటు వచ్చాడు. రామారావు అతణ్ణి కౌగలించుకున్నాడు. ప్రజలలో వుత్సాహం పెల్లుబికింది.

"బాబుగారు వారం రోజులవరకూ వెళ్ళడానికివీల్లేదు. ఈ వారంరోజులలో మనమంతా సంబరాలు జేద్దాం; గరిడీలు చేసి చూపిద్దాం. ఏనుగును తెచ్చి వూరూరా వూరేగిద్దాం— పాతిక జతల గిత్తలను కట్టి బాబు కూర్చున్న రథం లాగిద్దాం—."

ఆ యువకుని మాటలకు జయజయధ్వానాలు లేచాయ్. అందరివేపునవ్వుతూ తృప్తిగా చూశాడు రామారావు వాళ్ళనందరినీ పంపించేశాడు. ఒంటిగా తన పాకలో చాపమీద కూర్చున్నాడు. తను వీళ్ళందరిని విడిచి పెట్టి వెళ్ళటం అంత సులభమైన పనికాదు. స్వంతయిల్లు స్వజనాన్ని విడచిదూరదేశం యేకాంతంగా వెళ్ళిపోతున్నట్లనిపించింది. ఒంటిగా ఎగిరే పక్షిలా అయిపోయాడు. దుఃఖం పెల్లుబికి వలవలా యేడ్చేశాడు. భార్య భర్త యేడుపు చూసింది. జరగ బోయే సత్కారాలన్నీ తలచుకొని మనసులో మురిసిపోతుంది.

అతనికి జరుగవలసిన సత్కారాలు మరుచటి రోజునుంచీ చెయ్యటానికి గ్రామగ్రామాల్లో సన్నాహాలు జరిగి పోతున్నాయి. ప్రజలు తను కూర్చునేది బ్రహ్మరథమనీ మేమే లాగుతామనీ, వుద్యుక్తులౌతున్నారు. ఈ వేళ చార్జి క్రొత్తవానికి అప్పచెప్పేశాడు. తనూ భార్య కలసి ఆసుపత్రిలో రోగులను చూసి పళ్ళు కొని వాళ్ళందరికీ పంచిపెట్టి వచ్చారు. రాత్రి పదిగంటలవరకూ ప్రజయింటికివస్తూనే వున్నారు. పదిగంటల తర్వాత తనకు ఆయాసంగావుంది నిద్రపోతున్నానని చెప్పమని తన నమ్మకస్తుడైన రైతుతో చెప్పి గుమ్మంలో కూర్చోబెట్టాడు. రాత్రి పదకొండు

అయ్యింది. ప్రజ రావటం తగ్గింది. పండ్రెండు గంటలయ్యే సరికి జనసంచారంలేదు. చీకటి రాత్రులు. దానికితోడు అక్కడక్కడ ఆకాశన మబ్బులు కదులుతున్నాయి. గాలి పశ్చిమ వేపు వీస్తోంది. నది దక్షిణవేపు మామ్మూలుగా ప్రవహిస్తోంది. కాలం కదిలిపోతోంది.

తలపాగా చుట్టుకొని వీపు మీద ఒక మూటతో ఒక మనిషి ఆ నడిరాత్రప్పుడు వూరినించి నడచి పోయాడు. అతని వెంట ఒక స్త్రీ భుజం మీదనిద్ర పోతున్న పిల్లవాణ్ణివేసుకొని కాళ్ళీడ్చుకొని నడిచింది. వాళ్ళని యెవరూ చూడలేదు. ఊరికి దూరంగా రోడ్డుమీద తమకోసం చూస్తున్న మాటలు లేని యెడ్లబండి యెక్కారు.

తెల్లవారినా రామారావు యింటితలుపులుతెరవలేదు. వందల కొద్దీ అతనిని ఆహ్వానించడానికి అప్పుడే కాచుకొని వున్నారు. అతనిని దర్శించడానికి ముదుసలు రోగులు వేయి కళ్ళతో కాచుకొని కూర్చున్నారు. నడిరాత్రిమీద లేచి అతనిని చూడాలని నడుచుకొని వచ్చినవాళ్ళున్నారు.

ప్రొద్దెక్కినా తలుపులు తెరవబడలేదు. యిక ఆగలేక "బాబూ!" అని తలుపుతట్టారు. తలుపు తెరుచుకుంది. ఇంట్లోయెవరూ వున్నట్లు లేదు. "బాబూ!" అని గట్టిగా పిల్చారు. జవాబులేదు. గదిలోపలికి వెళ్ళి మరీ గట్టిగా పిల్చారు. ఆశబ్దమే ప్రతిధ్వనించింది. పిలిచినవ్యక్తిబయుటకువచ్చిఆతృతగా "బాబులేరు.....ఏమైపోయారో!"

అని అరిచాడు. నమ్మనివాళ్ళు యింట్లోనికి వెళ్ళారు. ఇంట్లో హరికేన్ లయిట్ చిన్నదిగా యింకా వెలుగుతోంది, ఆ వెలుగు అతను చిరునగవు నవ్వుతున్నట్లుగా వుంది. వాళ్ళకు అతను యిచ్చింది యెంతోవుంది. అతనిదీ అని వాళ్ళ దగ్గిర ఒకఫొటో కూడా లేదు- మిగిలింది ఆ హరికేన్ లైటే- దాన్నే ఆర్పకుండా యిప్పటికీ ఆ బ్లాకులో వూరూరా వెలిగించుకుంటున్నారు.

(1961)